నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

చిక్కడపల్లి, జూలై 23 (ఆంధ్రజ్యోతి): ఆజామాబాద్ డివిజన్ పరిధిలో గురువారం విద్యుత్ సరఫరా ఉండదని ఏడీఈ నాగేశ్వరరావు తెలిపారు. ఆజామాబాద్ ఐఈ పరిధిలో ఉదయం 10 నుంచి 12 గంటల వరకు, ఆర్‌వోఎమ్ పరిధిలో 12 నుంచి మధ్యాహ్నం 1 వరకు, ప్రివెంటివ్ మెడిసిన్ పరిధిలో 2నుంచి సాయంత్రం 4 గంటల వరకు, నారాయణగూడ పరిధిలో 3 నుంచి 5 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని పేర్కొన్నారు.

కనులపండువగా మహన్యాస రుద్రాభిషేకం

చిక్కడపల్లి, జూలై 23 (ఆంధ్రజ్యోతి): మాసశివరాత్రి సందర్భంగా బుధవారం ఆర్టీసీ క్రాస్‌రోడ్‌లోని లక్ష్మీగణపతి ఆలయం ప్రాంగణంలోని పార్వతీక్షీరలింగేశ్వరస్వామి మందిరంలో స్వామివారికి కనులపండువగా మహన్యాస రుద్రాభిషేకం నిర్వహించారు. సాయంత్రం శతకలశాభిషేకం చేశారు.. ఈవో లక్ష్మారెడ్డి, చైర్మన్ నర్సింగ్‌రావు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

వర్షాకాలంలో సమస్యలు తలెత్తొద్దు


వివిధ శాఖల అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్

గోల్నాక, జూలై 23 (ఆంధ్రజ్యోతి): వర్షాకాలం పురస్కరించుకుని అంబర్‌పేట నియోజకవర్గంలో ఎక్కడ కూడా ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు గురికాకుండా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ సూచించారు. బుధవారం గోల్నాక తులసీనగర్‌కాలనీలోని ఎమ్మెల్యే క్యాంపుకార్యాలయంలో జీహెచ్‌ఎంసీ, జలమండలి, విద్యుత్, పోలీస్ ఇంకా తదతర శాఖల అధికారులతో ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ సమావేశం నిర్వహించారు. వర్షాకాలంలో ఎదురైై అన్ని సమస్యలను అధికారులు ఎప్పటికప్పుడు సమన్వయంతో పరిష్కరించాలని సూచించారు.

విద్యార్థులకు స్కూల్ బ్యాగుల పంపిణీ నేడు

ముషీరాబాద్, జూలై 23 (ఆంధ్రజ్యోతి): మాజీమంత్రి కేటీఆర్ జన్మదినం సందర్భంగా గురువారం ముషీరాబాద్‌లోని గంగపుత్ర కాలనీలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు స్కూల్ బ్యాగులు పంపిణీ చేయనున్నట్లు బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు డి.శివముదిరాజ్ తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే ముఠా గోపాల్, బీఆర్ఎస్ యువ నాయకుడు జైసింహ హాజరవుతారని తెలిపారు.

పద్మశ్రీ రమేష్ గెల్లికి వైశ్యరత్న బిరుదు ప్రదానం



పద్మశ్రీ రమేష్‌కు వైశ్యరత్న బిరుదు ప్రదానం చేస్తున్న రాజమౌళిగుప్తా, డాక్టర్ నీలా శ్రీధర్ తదితరులు

నల్లకుంట, జూలై 23 (ఆంధ్రజ్యోతి): నాలుగున్నర దశాబ్దాలుగా బ్యాంకింగ్ రంగంలో తన దైన శైలిలో రాణించడంతో పాటు సమాజసేవా రంగంలో ఆపన్నులకు చేయూతనందిస్తున్న గొప్ప వ్యక్తి పద్మశ్రీ రమేష్ గెల్లి అని ఇంటర్నేషనల్ వైశ్య ఫెడరేషన్ న్యూఢిల్లీ అడ్వయిజరీ బోర్డు కమిటీ చైర్మన్ గంజి రాజమౌళిగుప్తా పేర్కొన్నారు. బుధవారం వాసవీ ఆర్ట్ థియేటర్స్ ఆధ్వర్యంలో నగరంలో జరిగిన కార్యక్రమంలో రమేష్ గెల్లికి వైశ్యరత్న బిరుదు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ వైశ్యజాతికి ఒక వజ్రం వంటి వ్యక్తి రమేష్ గెల్లి అని ప్రశంసించారు. వాసవీ ఆర్ట్ థియేటర్స్ చైర్మన్, ఐవీఎఫ్ ఉపాధ్యక్షుడు డాక్టర్ నీలా శ్రీధర్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో టీపీసీసీ ప్రధాన కార్యదర్శి ఉప్పల శ్రీనివాసగుప్తా, వాసవీ ఆస్పత్రి చైర్మన్ కొత్తూరు జయప్రకాష్‌రావు, ప్రధాన కార్యదర్శి కొండ్లె మల్లికార్జున్‌గుప్తా తదితరులు పాల్గొన్నారు.



ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షల్లో కాచిగూడ ప్రభుత్వ జూనియర్ కళాశాలకు చెందిన ద్వితీయ సంవత్సరం విద్యార్థిని షమీన్ బైపీసీ వృక్షశాస్త్రంలో 60 మార్కులకు గాను 59 మార్కులు సాధించాడు. దీంతో బుధవారం నగదు బహుమతిని అతడికి అందజేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ చిరంజీవి, సీనియర్ అధ్యాపకులు శ్రీనివాసరావు, ప్రసాదరావు, గీత, డాక్టర్ బి.లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు. - బర్కత్‌పుర, ఆంధ్రజ్యోతి

'నన్ను తొలగించే అధికారం ఎవరికీ లేదు'

రాంనగర్, జూలై 23 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ ఎలక్ట్రిసిటీ ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్ వ్యవస్థాపకుడైన తనను తొలగించే అధికారం ఎవరికీ లేదని ఆ సంఘం వ్యవస్థాపక ప్రధాన కార్యదర్శి మాతంగి శ్రీనివాస్ పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్ర సాధనలో భాగంగా ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సంక్షేమం కోసం 2010లో తమ సంఘాన్ని స్థాపించుకోవడం జరిగిందన్నారు. బుధవారం బాగ్‌లింగంపల్లిలోని అసోసియేషన్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సంఘం కార్యనిర్వాహక అధ్యక్షుడు పీఎం.రాజు, టీజీఎస్పీడీసీఎల్ కంపెనీ నాయకులు ఇమ్మడి జనార్దన్, పుల్లూరి రవీందర్‌తో కలిసి ఆయన మాట్లాడారు. కొన్ని అనివార్య కారణాల వల్ల 2012లో మానకొండూరు మాజీ ఎమ్మెల్యే ఆరేపల్లి మోహన్‌ను అధ్యక్షుడిగా నియమించుకున్నామని, రెండేళ్లుగా తనపై కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతున్నారని ఆరోపించారు.

తిలక్‌నగర్ చౌరస్తాలో డ్రంకెన్ డ్రైవ్ తనిఖీ


తిలక్‌నగర్ చౌరస్తాలో డ్రంకెన్ డ్రైవ్ టెస్ట్ చేస్తున్న డీసీపీ శ్రీనివాస్, ఏసీపీ శ్రీనివాస్

అంబర్‌పేట, జూలై 23 (ఆంధ్రజ్యోతి): కాచిగూడ ట్రాఫిక్ పోలీసులు బుధవారం అంబర్‌పేట తిలక్‌నగర్ చౌరస్తాలో డ్రంకెన్ డ్రైవ్ కార్యక్రమం నిర్వహించారు. ట్రాఫిక్ డీసీపీ సుంకరి శ్రీనివాస్, ఏసీపీ ఎ.శ్రీనివాస్ పర్యవేక్షణలో కాచిగూడ ట్రాఫిక్ సీఐ శ్రీనివాస్ ఆధ్వర్యంలో పోలీసులు ఉదయం 11 గంటల సమయంలో డ్రంకెన్ డ్రైవ్ నిర్వహించారు. తాగి ద్విచక్రవాహనం నడుపుతున్న ఓ వాహనదారుడిపై కేసు నమోదు చేశారు. ఈ సందర్భంగా డీసీపీ శ్రీనివాస్ మాట్లాడుతూ నగర పోలీసు కమిషనర్ ఆదేశాల మేరకు డ్రంకెన్ డ్రైవ్ కార్యక్రమాన్ని 24 గంటలు నిర్వహిస్తామని తెలిపారు. వాహనదారులు మద్యం తాగి వాహనాలు నడపొద్దని సూచించారు.

● అంబర్‌పేట సీఐకి సత్కారం



బోనాల వేడుకలు ప్రశాంతంగా జరగడంలో తోడ్పడిన అంబర్‌పేట సీఐ కిరణ్‌కుమార్‌ను బీఆర్ఎస్ అంబర్‌పేట డివిజన్ అధ్యక్షుడు సిద్ధార్థ ముదిరాజ్ బుధవారం అంబర్‌పేట పీఎస్‌లో శాలువాకప్పి సత్కరించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

- అంబర్‌పేట, ఆంధ్రజ్యోతి

మరింత సుందరంగా
నల్లపోచమ్మ భూలక్ష్మీ దేవాలయం

నూతనంగా దేవతామూర్తుల ప్రతిమలు


రంగానగర్ నల్లపోచమ్మ దేవాలయం


దేవాలయానికి దేవతామూర్తుల ప్రతిమలు తయారు చేస్తున్న కళాకారులు

ముషీరాబాద్, జూలై 23 (ఆంధ్రజ్యోతి): భోలక్‌పూర్ డివిజన్ రంగానగర్ సెకండ్ వెంచర్‌లో 100 సంవత్సరాల చరిత్ర గల నల్లపోచమ్మ భూలక్ష్మీ దేవాలయాన్ని మరింత సుందరంగా తీర్చిదిద్దేందుకు 10 రోజులుగా ముమ్మరంగా పనులు కొనసాగుతున్నాయి. ఆలయం చుట్టూ దేవతామూర్తుల ప్రతిమలను తయారు చేయిస్తున్నారు. ఇప్పటికే ఆలయానికి ఇరు పక్కల దేవతామూర్తుల ప్రతిమలను తయారు చేశారు.

వంద సంవత్సరాల చరిత్రగల ఆలయం ముస్తాబ్..

రంగానగర్ సెకండ్ వెంచర్‌లో 100 సంవత్సరాల చరిత్రగల నల్లపోచమ్మ, భూలక్ష్మీ దేవాలయాన్ని మరింత సుందరంగా తీర్చిదిద్దేందుకు ఆలయ కమిటీ నిర్వాహకులు తమిళనాడు రాష్ట్రంలోని తంజాజూరు నుంచి విగ్రహాలను తయారు చేసే ప్రముఖ కళాకారులను రప్పించారు. ఆలయ ముఖద్వారం ఇరుపక్కల ద్వారకాపాలకులు నల్లపోచమ్మ, దుర్గామాత, ఎల్లమ్మ దేవతామూర్తుల ప్రతిమలను తయారు చేస్తున్నారు. ఇప్పటికే 90శాతం పనులు పూర్తి అయ్యాయి. 10రోజుల నుంచి కళాకారులు రాత్రిపగలు విగ్రహాలను తయారు చేస్తున్నారు. ఒక్కో విగ్రహం 4 అడుగులకు పైగా ఎత్తు ఉండేలా తీర్చిదిద్దుతున్నారు. నూతనంగా దేవతామూర్తుల ప్రతిమల ఏర్పాటుతో ఆలయానికి మరింత శోభ సంతరించుకోనుంది. ఆలయం చుట్టూ ఏర్పాటు చేస్తున్న ప్రతిమలు భక్తులను విశేషంగా ఆకట్టుకుంటున్నాయి.

ఐదు దేవతామూర్తుల ప్రతిమలు ఏర్పాటు



నల్లపోచమ్మ దేవాలయ చుట్టూ ఐదు దేవతామూర్తుల ప్రతిమలను తయారు చేయించాం. త్వరలో దేవతామూర్తుల ప్రతిమలకు రంగులు వేయిస్తాం. రాబోయే ఆదివారం జరిగే బోనాలకు సిద్ధంగా చేస్తాం.

- వై.శ్రీనివాస్‌రావు, రంగానగర్ అధ్యక్షుడు

విగ్రహాలు తయారు చేసేందుకు తమిళనాడు నుంచి వచ్చాం



ఆలయానికి దేవతామూర్తుల ప్రతిమలు తయారు చేసేందుకు తమిళనాడు నుంచి వచ్చాం. ఐదు దేవతామూర్తుల విగ్రహాలు తయారుచేశాం. దేవాతామూర్తుల ప్రతిమలు అందరినీ ఆకట్టుకున్నాయి. నగరంలో పలు ప్రముఖ దేవాలయాలను సైతం నిర్మించాం.

- కె.జయరాం, విగ్రహాల కళాకారుడు

బీసీల మనోధైర్యాన్ని దెబ్బతీయడమే బీజేపీ కుట్ర


ఆర్టీసీ క్రాస్‌రోడ్స్‌లో దిష్టిబొమ్మను దహనం చేస్తున్న బీసీ సంక్షేమ సంఘం నేతలు ఎర్ర సత్యనారాయణ తదితరులు

రాంనగర్, జూలై 23 (ఆంధ్రజ్యోతి): బీసీల మనోధైర్యాన్ని దెబ్బతీసే అగ్రకుల కుట్రలో భాగమే రాంచందర్‌రావు వ్యాఖ్యలని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎర్ర సత్యనారాయణ ఆరోపించారు. బీసీల 42 శాతం రిజర్వేషన్లను రాజ్యాంగంలోని 9వ షెడ్యూల్‌లోకి చేర్చడం సాధ్యం కాదని, న్యాయపరమైన చిక్కులు ఎదురవుతాయని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రాంచందర్‌రావు ఢిల్లీలో చేసిన ప్రకటన బీజేపీ నిజస్వరూపాన్ని బట్టబయలు చేసిందని ఆరోపించారు. ఈ వ్యాఖ్యలను తక్షణమే ఉపసంహరించుకుని బేషరతుగా బీసీ సమాజానికి బహిరంగ క్షమాపణలు చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. బుధవారం బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు వ్యాఖ్యలకు నిరసనగా ఆర్టీసీ క్రాస్‌రోడ్స్‌లో ఆయన చిత్రపటాన్ని బీసీ సంఘం నేతలు దహనం చేశారు. ఈ కార్యక్రమంలో బీసీ సంఘం నేతలు పి.సుధాకర్ ముదిరాజ్, విజయభాస్కర్, బోయ గోపి, ఇన్‌రావు తదితరులు పాల్గొన్నారు.


గురుకుల పాఠశాలలపై నిర్లక్ష్యం



బీసీ కమిషన్ చైర్మన్ నిరంజన్‌కు వినతిపత్రం సమర్పిస్తున్న బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు ఆనంద్‌గౌడ్ తదితరులు

నల్లకుంట, జూలై 23 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్రంలో గురుకులాల పనితీరుపై ప్రభుత్వం, యంత్రాంగం పూర్తి నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయని బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు గంధమల్ల ఆనంద్‌గౌడ్ ఆరోపించారు. దీంతో గురుకులాల పాఠశాలల్లోని విద్యార్థులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని విమర్శించారు. ఈ మేరకు బుధవారం తెలంగాణ రాష్ట్ర బీసీ కమిషన్ చైర్మన్ జి.నిరంజన్, సభ్యులు సురేందర్, రాపోలు ప్రకాష్, బాలలక్ష్మిని ఆనంద్‌గౌడ్ నేతృత్వంలోని బీజేపీ ఓబీసీ మోర్చా ప్రతినిధి బృందం కలిసి వినతిపత్రం సమర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గురుకుల పాఠశాలలో మౌలిక వసతులు కల్పించడంలో ప్రభుత్వం, అధికార యంత్రాంగం సరైన దృష్టి సారించడం లేదన్నారు. ఈ విషయంపై తమ బృందం పర్యటించి పలు సమస్యలతో కూడిన నివేదికను బీసీ కమిషన్‌కు వివరించామన్నారు. ఇందుకు స్పందించిన బీసీ కమిషన్ చైర్మన్ నిరంజన్ ఈ వైనంపై ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి తగు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర ప్రధానకార్యదర్శి నందనం దివాకర్, కార్యదర్శి ప్యారసాని వెంకటేష్, జాతీయ కార్యవర్గ సభ్యులు పూస రాజు, నాయకుడు జక్కిలి రాజు తదితరులు పాల్గొన్నారు.

రోడ్ల సమస్యలపై చర్యలు తీసుకోవాలి


జీహెచ్‌ఎంసీ కమిషనర్ ఆర్‌వీ.కర్ణన్‌కు వినతిపత్రం ఇస్తున్న కార్పొరేటర్ యాకర అమృత తదితరులు

నల్లకుంట, జూలై 23 (ఆంధ్రజ్యోతి): ఇటీవల కురుస్తున్న భారీ వర్షాల వల్ల నల్లకుంట డివిజన్‌లోని పలు రహదారులు, అంతర్గత రోడ్లు గోతులమయం అయ్యాయని, రాకపోకల సాగించడానికి ప్రజలు, వాహనదారులు నానా ఇబ్బందులు పడుతున్నారని కార్పొరేటర్ యాకర. అమృత పేర్కొన్నారు. అదేవిధంగా పలు చోట్ల పెండింగ్‌లో ఉన్న రోడ్డు నిర్మాణంపై చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఈ మేరకు బుధవారం జీహెచ్‌ఎంసీ కమిషనర్ ఆర్‌వీ.కర్ణన్‌కు కార్పొరేటర్ వినతిపత్రం సమర్పించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ డివిజన్‌లోని శంకరమఠం కూరగాయల మార్కెట్ రోడ్డు ఎంతో కాలంగా పెండింగ్‌లో ఉందన్నారు. అలాగే పలు ప్రాంతాలలో గుంతలమయమైన రోడ్లు, ప్యాచ్‌వర్క్ పనులతో అధ్వానస్థితి నెలకొందన్నారు. దీంతో ఈ రహదారులలో వృద్ధులు, పాఠశాలలకు వెళ్లే విద్యార్థులు, వాహనదారులు ఉదయం, సాయంత్రం వేళల్లో తీవ్ర అవస్థలు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. స్పందించిన కమిషనర్ నల్లకుంటలో రోడ్లు, ప్యాచ్‌వర్క్ ఇతరత్ర పనులపై అధికారులను ఆదేశించి, నిధులు మంజూరు చేయిస్తామని తెలిపారు.

'మహాలక్ష్మి' 200 కోట్లకు చేరడం అభినందనీయం



బర్కత్‌పుర డిపోలో కేక్ తినిపించుకుంటున్న మురళీకృష్ణ, ఆర్టీసీ సిబ్బంది

బర్కత్‌పుర, జూలై 23 (ఆంధ్రజ్యోతి): మహాలక్ష్మి పథకం కింద కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన మహిళలకు ఉచిత ప్రయాణం 200 కోట్లకు చేరడం అభినందనీయం అని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు కేపీ.మురళీకృష్ణ అన్నారు. బుధవారం బర్కత్‌పుర ఆర్టీసీ డిపోలో ప్రయాణికుల సంఖ్య 200 కోట్లకు చేరిన సందర్భంగా సంబరాలు నిర్వహించారు. ఆర్టీసీ సిబ్బందికి ఆయన స్వీట్లు పంపిణీ చేసి సత్కరించి మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన ఆరు గ్యారంటీల హామీని తూచా తప్పకుండా అమలు చేస్తుందన్నారు. మహిళలు ఉచిత ప్రయాణంతోపాటు 650 ఆర్టీసీ బస్సులను కొనుగోలు చేసి వాటి నిర్వహిణ బాధ్యతను మహిళాపొదుపు సంఘాలకు ఇచ్చారన్నారు. అన్ని వర్గాల ప్రజలు సీఎం రేవంత్‌రెడ్డి ప్రభుత్వంపై సంతృప్తి వ్యక్తం చేస్తున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో బర్కత్‌పుర బస్ డిపో ఆర్టీసీ అధికారులు మిథున, రఘునందన్, లక్ష్మణ్, జనార్దన్; జయలక్ష్మి, కాంగ్రెస్ పార్టీ నాయకులు దేవిరెడ్డి విజితారెడ్డి, సీహెచ్.మురళీ, నందు, నంద్‌కుమార్, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజాభివృద్ధి పనులను పూర్తిచేయాలి


పనులను పర్యవేక్షిస్తున్న కార్పొరేటర్ పావని

చిక్కడపల్లి, జూలై 23 (ఆంధ్రజ్యోతి): ప్రజాభివృద్ధిపనులు త్వరితగతిన పూర్తిచేసి వినియోగంలోకి తేవాలని గాంధీనగర్ కార్పొరేటర్ ఎ.పావనివినయ్‌కుమార్ అన్నారు. జవహర్‌నగర్ టీఆర్‌టీ క్వార్టర్స్‌లో కొనసాగుతున్న నూతన మంచినీటి పైప్‌లైన్ ఏర్పాటు పనులను బుధవారం ఆమె వాటర్‌వర్క్స్ మేనేజర్ కృష్ణమోహన్‌తో కలిసి పరిశీలించి, పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ డివిజన్‌లో నెలకొన్న అతిక్లిష్టమైన సమస్య మంచినీటి సరఫరాలో లోప్రెషర్‌ను పరిష్కరించేదిశగా పనులు చేపడుతున్నామన్నారు. వాటర్‌వర్క్స్ ఎండీతో మాట్లాడి ఆరు అంగుళాల నూతన పైప్‌లైన్‌ను మంజూరు చేయించగా పనులు కొనసాగుతున్నాయన్నారు. బీజేపీ నేతలు నవీన్‌కుమార్, రత్నసాయిచంద్, శ్రీకాంత్, రఘుయాదవ్, స్థానికులు సత్యనారాయణ, వినోద్, శ్రీనివాస్, వాల్టాస్, ఐ.శ్రీనివాస్ పాల్గొన్నారు.

డివిజన్‌ను ప్రగతిపథంలో నిలిపేందుకు కృషి: కార్పొరేటర్

గాంధీనగర్ డివిజన్‌లోని నేతాజీనగర్ ప్రజలు 30 సంవత్సరాలుగా ఎదుర్కొంటున్న రోడ్లు, మంచినీరు, సివరేజీ పైప్‌లైన్ ఏర్పాటు సమస్యలు పరిష్కరించినందుకు కృతజ్ఞతగా కార్పొరేటర్ పావనివినయ్‌కుమార్‌ను బుధవారం బస్తీలో ప్రజలు సన్మానించారు. పావని మాట్లాడుతూ డివిజన్‌లోని అన్ని ప్రాంతాల్లో ప్రాధాన్యతాక్రమంలో ప్రజాభివృద్ధిపనులు కొనసాగేవిధంగా కృషిచేస్తున్నట్లు పేర్కొన్నారు. బీజేపీ నాయకులు వినయ్‌కుమార్, నవీన్‌కుమార్, ఆనంద్‌రావు, బస్తీవాసులు ప్రభాకర్, నాగరాజు, కుమార్, మంగమ్మ, లక్ష్మి, రత్నమ్మ, సువర్ణ, యాదమ్మ తదితరులు పాల్గొన్నారు.

నేరస్థుల తీరు ఆందోళనకరం : పీవోడబ్ల్యూ

నల్లకుంట, జూలై 23 (ఆంధ్రజ్యోతి): నేరస్థులు ధైర్యంగా తమను ఎవరూ ఏమీ చేయలేరని బాహటంగా ప్రకటిస్తున్న పరిస్థితులు తీవ్ర ఆందోళన కలిగిస్తున్నాయని ప్రగతిశీల మహిళా సంఘం(పీవోడబ్ల్యూ) తెలంగాణ రాష్ట్ర అధ్యక్షురాలు జి.అనసూయ, ప్రధానకార్యదర్శి అందే మంగ పేర్కొన్నారు. గతంలో యూపీలో, ఢిల్లీలోని నోయిడాలో ఇటువంటి సామూహిక హత్యల ఖననాల ఉదంతాల బహిర్గతమైన వైనంపై పాలకులు చర్యలు తీసుకోవడంలో నిర్లిప్తతను ప్రదర్శిస్తున్నాయని ఆరోపించారు. బుధవారం విద్యానగర్‌లోని మార్క్స్ భవన్‌లో జరిగిన సమావేశంలో వారు మాట్లాడారు. కర్నాటక రాష్ట్రంలో పవిత్ర ఆధ్యాత్మిక కేంద్రంగా భావించే ధర్మస్థలంలో 300 మంది ఆడపిల్లలు, మహిళలపై హత్యలు, అత్యాచారాలు జరిపి పూడ్చిపెట్టిన విషయం బహిర్గతం విదితమేనన్నారు. వారం రోజులు కావస్తున్న ఈ ఘటనపై అక్కడి రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకోకపోవడం శోచనీయమన్నారు. ఈ వైనంపై బలమైన శక్తుల హస్తం ఉందని విమర్శించారు. ఈ ధర్మస్థలంలో సామూహిక ఖననాల వైనంపై సిట్టింగ్ జడ్జితో నిష్పాక్షిక విచారణ జరిపించి నేరస్థులను కఠినంగా శిక్షించి, బాధితులకు రక్షణ కల్పించాలని వారు డిమాండ్ చేశారు.

ఫీజు బకాయిలను విడుదల చేయాలి: ఎంఎస్ఎఫ్

నల్లకుంట, జూలై 23 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో విద్యారంగంపై ప్రభుత్వం పూర్తి నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని ఎంఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కొల్లూరు వెంకటేష్ ఆరోపించారు. ఉన్నత విద్యను అభ్యసిస్తున్న ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ పేద విద్యార్థులకు ప్రభుత్వం చెల్లించాల్సిన ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు రూ.7,500 కోట్లు విడుదల చేయకపోవడంతో ఆయా వర్గాల విద్యార్థులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. బుధవారం విద్యానగర్‌లోని ఎమ్మార్పీఎస్ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే విద్యార్థులకు బ్రహ్మరథం పడుతామని గొప్పలు చెప్పిన సీఎం రేవంత్‌రెడ్డి పెండింగ్ ఫీజు బకాయిలను విడుదల చేయడంలో విఫలమయ్యారని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం నిర్లక్ష్యం వల్ల విద్యారంగం సంక్షోభంలో మునిగిపోయిందన్నారు. రాష్ట్రంలో ప్రభుత్వం ఏర్పడి 18 నెలలు పూర్తయినా ప్రభుత్వం విద్యారంగ సమస్యలకు ఒక్క అడుగు ముందుకు వేయలేదన్నారు. బకాయి ఫీజులను వెంటనే విడుదల చేయాలని ఆయన రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలి



గార్బేజ్ రిక్షాలను పంపిణీ చేస్తున్న కవాడిగూడ కార్పొరేటర్ రచనశ్రీ

కవాడిగూడ, జూలై 23 (ఆంధ్రజ్యోతి): ఇంటి పరిసరాలను శుభ్రంగా ఉంచుకున్నప్పుడే ప్రతి ఒక్కరూ ఆరోగ్యంగా ఉంటారని కవాడిగూడ కార్పొరేటర్ జి.రచనశ్రీ సూచించారు. అందుకోసం ఇళ్లముందుకొచ్చే ఆటో రిక్షాలలో, గార్బేజ్ రిక్షాలలో చెత్తను వేయాలని ఆమె కవాడిగూడ డివిజన్ ప్రజలకు సూచించారు. బుధవారం కవాడిగూడ డివిజన్‌లోని దోమలగూడ వార్డు కార్యాలయం వద్ద నూతనంగా మంజూరైన 10 చెత్త గార్బేజ్‌రిక్షాలను కార్పొరేటర్ జి.రచనశ్రీ ముఖ్యఅతిథిగా హాజరై కార్మికులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజలందరూ ఇళ్లముందుకు వచ్చే చెత్తను తరలించే ఆటో రిక్షాలలో చెత్తను వేసి మునిసిపల్ సిబ్బందికి సహకరించాలన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర నాయకులు జి.వెంకటేష్, మునిసిపల్ జవాన్ లింగం, సూపర్ వైజర్లు సూర్యప్రకాష్, రాము, కిరణ్, మజర్ పాల్గొన్నారు.

డబ్బులిస్తేనే రేషన్‌కార్డు మంజూరు చేస్తున్నారు..!

సివిల్ సప్లైయ్ కమిషనర్‌కు బీజేపీ ఫిర్యాదు

ముషీరాబాద్, జూలై 23 (ఆంధ్రజ్యోతి): పౌరసరఫరాల శాఖ సర్కిల్-8 సంబంధించిన ఉన్నత అధికారి మహ్మద్‌సమీర్ డబ్బులు తీసుకుని రేషన్‌కార్డులు మంజూరు చేస్తున్నారని బీజేపీ మహంకాళి జిల్లా కార్యవర్గ సభ్యుడు బైరు నాగేందర్ ఆరోపించారు. బుధవారం పౌరసరఫరాల శాఖ కమిషనర్‌కు సర్కిల్ -8 ఉన్నత అధికారిపై ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా భోలక్‌పూర్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో నాగేందర్ మాట్లాడుతూ... పౌరసరఫరాల శాఖ సర్కిల్ - 8 ఉన్నతాధికారి మహ్మద్ సమీర్ డబ్బులు ఇచ్చిన వారికే రేషన్‌కార్డులు మంజూరు చేయిస్తున్నారని పేర్కొన్నారు. ఎలాంటి విచారణ జరపకుండా రూ.1000 నుంచి రూ.8000వరకు బలవంతంగా వసూలు చేస్తున్నారని ఆరోపించారు. డబ్బులు ఇవ్వలేని పేదప్రజల దరఖాస్తులను రిజెక్ట్ చేస్తున్నారని అన్నారు. ఇందుకు సంబంధించిన ఆధారాలు తమ వద్ద ఉన్నాయని తెలిపారు. సర్కిల్ - 8 పరిధిలో జరుగుతున్న అక్రమాలపై పౌరసరఫరాల శాఖ కమిషనర్‌కు సైతం ఫిర్యాదు చేశామని తెలిపారు. భోలక్‌పూర్ ప్రాంతంలో అనేక మంది దరఖాస్తుదారుల నుంచి డబ్బులు వసూలు చేశారని పేర్కొన్నారు. ఇలాంటి అవినీతి అధికారుల వల్ల భోలక్‌పూర్‌లో నివసించే పేద ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి రేషన్‌కార్డుల జారీలో సర్కిల్- 8 ఉన్నత అధికారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

ముగ్గురు దొంగల అరెస్ట్

బర్కత్‌పుర జూలై 23 (ఆంధ్రజ్యోతి): దొంగతనాలకు పాల్పడుతున్న ముగ్గురు దొంగలను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. కాచిగూడ పోలీసులు డీఐ కె.రఘుకుమార్ తెలిపిన వివరాల ప్రకారం... చాంద్రాయణగుట్టకు చెందిన మహ్మద్ రఫ్(18), కాచిగూడ కృష్ణానగర్‌కు చెందిన మహ్మద్‌సలీం(18), సంతోష్‌నగర్ భవాని నగర్‌కు చెందిన షేక్ షాకీర్(26) ముగ్గురు స్నేహితులు. వీరిలో షేక్ షాకీర్ రౌడీ షీటర్. ఇతనిపై పలు కేసులు ఉన్నాయి. ఈ ముగ్గురు మద్యం తాగి ఈనెల 18వ తేదీన కాచిగూడ రైల్వే స్టేషన్ రెండో గేటు వద్ద కిరణ్ అనే వ్యక్తిని బీరు బాటిల్‌తో తలపై కొట్టి బెదిరించారు. అతని జేబులోని రూ.700 నగదును సెల్ ఫోన్‌ను తీసుకొని పారిపోయారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన కాచిగూడ పోలీసులు బుధవారం ముగ్గురు నిందితులను అరెస్టు చేసి, రిమాండ్‌కు తరలించినట్లు డీఐ తెలిపారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం స్వాధీనం

కవాడిగూడ, జూలై 23 (ఆంధ్రజ్యోతి): ఓ గుర్తుతెలియని(55) వ్యక్తి మృతదేహాన్ని దోమలగూడ పోలీసులు స్వాధీనంచేసుకొని, పోస్టుమార్టం నిమిత్తం గాంధీ మార్చురీకి తరలించారు. ఎస్ఐ నిరంజన్ తెలిపిన వివరాల ప్రకారం..... దోమలగూడ పీఎస్‌పరిధిలోని గిల్కాచౌరస్తాలో గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం పడి ఉందని పోలీసులకు సమాచారం ఇచ్చారు. దీంతో పోలీసులు అక్కడికి చేరుకుని, మృతదేహాన్ని గాంధీ మార్చురీకి తరలించినట్లు ఆయన తెలిపారు. అతని ఆచూకీ తెలిసిన వారు దోమలగూడ పోలీస్‌స్టేషన్‌లో గానీ లేదా ఫోన్ 8712661524లో సమాచారం అందించాలని ఎస్ఐ నిరంజన్ కోరారు.